క్లుప్తంగా

ఆంబోతు గోశాలకు తరలింపు



ఆంబోతును గోశాలకు తరలిస్తున్న నెస్ట్ ఆర్గనైజేషన్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: గాయంతో బాధ పడుతున్న ఆంబోతును నెస్ట్ ఆర్గనైజేషన్ ఫౌండేషన్ సభ్యులు గోశాలకు తరలించారు. గురువారం మనీష్ గౌడ్ మాట్లాడుతూ స్థానిక వెంకటేశ్వర కాలనీలో 15 రోజులు క్రితం ఆంబోతు గోతిలో పడిపోయింది. స్థానికులు దానిని బయటకు తీశారు. ఈ సందర్భంలో ఆంబోతు కాలిలో ఏదో గుచ్చుకోవడంతో కాలు పుండు పడి నడవలేని స్థితిలో అక్కడే ఉంది. స్థానికులు దానికి మేత పెడుతున్నారు. సమాచారం అందుకున్న నెస్ట్ ఆర్గనైజేషన్ మున్సిపల్ కమిషనర్ విజయసారథి దృష్టికి తీసుకువెళ్లగా ఆంబోతును వ్యాన్‌పై ఎక్కించడానికి క్రేన్‌ను పంపించారు. నరసాపురం గోశాలకు తరలించారు. ఏ జంతువు ప్రమాదంలో ఉన్నా దాని సంరక్షణకు తమ సంస్థ అందుబాటులో ఉంటుందని మనీష్ గౌడ్ తెలిపారు.

పండ్ల పంపిణీ



క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో పండ్లు పంపిణీ చేస్తున్న కాపు క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో యునైటెడ్ కాపు క్లబ్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. గురువారం ఆలయ ప్రాంగణంలో కోటి శివ లింగార్చన నిమిత్తం మట్టితో శివలింగాలు తయారు చేస్తున్న మహిళలకు కాపు క్లబ్ సభ్యులు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కాపు క్లబ్ నూతనంగా ఏర్పడిన తరువాత మొట్ట మొదటి కార్యక్రమం దైవ సన్నిధిలో చేయాలనే సంకల్పంతో ఆలయంలో శివలింగాలు తయారు చేస్తున్న మహిళలకు పండ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ముచ్చర్ల సంజయ్, గవర్నర్ పెనుమాక రామ్మోహన్, అధ్యక్షులు జక్కంపూడి మదన్, సెక్రటరీ వేరుకొండ దుర్గాప్రసాద్, కఠారి నాగేంద్ర, పర్యావుల రవికుమార్, గంధం ఏసుపాదం, గుండుమోగుల వీరాస్వామి, పోకల సాయి, తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో సాయినాథుడు

పెనుగొండ: ఆషాఢమాసం సందర్భంగా గురువారం వడలిలోని సాయినాథుడు శాకంబరీ అలంకారంలో దర్శనం ఇచ్చాడు. ఉదయం నుంచి భక్తులు వందలాదిగా తరలి వచ్చి శాకంబరీ సాయినాథుడిని దర్శించుకున్నారు.

ఆక్రమణలతో ఆయకట్టు ముంపు

- మైనర్ డ్రెయిన్లలో పెరిగిన ఆక్రమణలు
- బోదెల్లో కొబ్బరి చెట్లతోనే అసలు సమస్య

యలమంచిలి: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వల్లూరు డ్రెయిన్ పొంగడంతో ఆచంట, యలమంచిలి మండలాల్లోని 20 గ్రామాలలో వందలాది ఎకరాల వరి పొలాలు, ఆక్వా చెరువులు నీట మునిగాయి. ఈ గ్రామాల్లో వరి పొలాలు గోదావరిని తలపిస్తున్నాయి. ప్రతి సంవత్సరం డ్రెయిన్ పొంగడం వల్ల రైతులు నష్టపోతున్నా సమస్య పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా డ్రెయిన్స్ అధికారులు మైనర్ డ్రెయిన్ నిర్వహణను గాలికొదిలేయడం వల్లే ముంపు సమస్య అధికమైనదని రైతులు ఆరోపిస్తున్నారు.

ఆక్రమణలో మైనర్ డ్రెయిన్లు

సుమారు 50 ఎకరాల భూమికి ఒక మైనర్ డ్రెయిన్ ఉంటుంది. పంట పొలాలు, పుంతల మధ్య నుంచి ఈ మైనర్ డ్రెయిన్స్ మురుగునీటిని ప్రధాన డ్రెయిన్‌లోనికి మళ్లిస్తాయి. కొన్ని ప్రాంతాల్లో సాగు నీటికి, మురుగునీటికి కూడా ఈ మైనర్ డ్రెయిన్స్‌నే ఉపయోగిస్తారు. అయితే ఈ మైనర్ డ్రెయిన్స్‌ను ఆనుకుని కొబ్బరిమొక్కలు, అరటి మొక్కలు వంటి ఫల వృక్షాలు వేయడం వల్ల డ్రెయిన్స్‌లో నీటి ప్రవాహానికి ఇవి అడ్డుపడి మురుగునీరు ముందుకు వెళ్లకుండా అడ్డుకుంటున్నాయి. దీంతో వర్షాలు, వరదలు తగ్గినా చేలలోని నీరు ప్రధాన డ్రెయిన్‌లోనికి వేగంగా వెళ్లకుండా ఈ ఆక్రమణలు అడ్డుపడుతున్నాయి. వేసవి సమయంలో ఈ ఆక్రమణలను తొలగించి, మళ్లీ ఆక్రమణలు జరగకుండా చర్యలు



గుంపర్రులో నీటమునిగిన వరిచేల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు



గుంపర్రులో మురుగుబోదిలోకి దిగిపోయిన కొబ్బరిచెట్లు

తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వలనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. గుంపర్రు పంచాయతీ కడిమిపుంత మీదుగా సీతమ్మచెరువు, చింతదిబ్బ గ్రామాలను తాకుతూ సుమారు 150 ఎకరాల మురుగునీటిని పారించే డ్రెయిన్ గట్టున సీతమ్మచెరువు వద్ద రైతులు పెద్ద ఎత్తున కొబ్బరిమొక్కలు నాటారు. గట్టు పక్కగా కొబ్బరిమొక్కలు నాటడం వల్ల ప్రస్తుతం ఈ మొక్కలన్నీ డ్రెయిన్ లోనికి జారిపోయాయి. చెట్ల నుంచి పడిన కొబ్బరి ఆకులు, తుక్కు వల్ల మురుగునీరు వేగంగా లాగడం లేదు. దీంతో చేలన్నీ ముంపులోనే ఉంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మైనర్ డ్రెయిన్స్ ఆక్రమణలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

దాళ్వా పంట సొమ్ము రాకపోయినా..



వరదల వల్ల పంట ఆలస్యం అవుతుంది. ఆలస్యంగా అమ్మిన ధాన్యానికి ప్రభుత్వం సకాలంలో డబ్బులు ఇవ్వడం లేదు. మే నెలల దాళ్వా ధాన్యం అమ్మాను. ఇంత వరకు డబ్బులు రాలేదు. మళ్లీ అప్పు చేసి ఏడెకరాలు ఊడ్చాను. ఇలపకుర్రు పంట కాల్వకు గండి పడడం వల్ల చేను మొత్తం మునిగిపోయింది. కనీసం మళ్లీ ఆకుమడి వేయాలన్నా చేనులో మురుగు తగ్గే అవకాశం కనిపించడం లేదు. దీంతో వ్యవసాయం చేయాలంటేనే భయం వేస్తుంది. అధికారులు స్పందించి ముంపు సమస్యకు పరిష్కారం చూపాలి.

– ఉలిసి సత్తిబాబు, రైతు గుంపర్రు

నష్ట పరిహారం కాదు.. శాశ్వత పరిష్కారం చూపాలి



మైనర్ డ్రెయిన్‌లో కొబ్బరి చెట్లు రావడం వల్ల మురుగునీరు వేగంగా లాగడం లేదు. ఇప్పటికే రూ.50 వేలు వెచ్చించి ఐదెకరాలు ఊడ్చాను. మొత్తం భూమంతా మునిగిపోయింది. మరొక పది రోజులైనా చేలో నీరు బయటకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చే నష్ట పరిహారం మాకు ముఖ్యం కాదు. పంట సక్రమంగా పండితేనే రైతులకు నాలుగు డబ్బులు వస్తాయి. కాబట్టి డ్రెయిన్‌లో ఆక్రమణలు తొలగించి రైతులకు సహాయం చేయాలి.

– గుడాల నరసింహారావు, రైతు, గుంపర్రు

మందాలమ్మకు పానకాల సమర్పణ



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మకు గ్రామస్తులు పానకాల కావిడిని సమర్పించారు. ఆషాఢ మాసం సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించి, చలిమిడి, పసుపు కుంకుమ, గాజులు, పండ్లు సమర్పించారు.

నిలకడగా గోదావరి



వలంధర్ రేవు వద్ద ప్రవాహ వేగం తగ్గిన గోదావరి



కనకాయలంక కాజ్‌వే మీద ప్రవహిస్తున్న వరద నీరు

నరసాపురం: వశిష్ట గోదావరి మరింత శాంతించింది. ప్రవాహ ఉధృతితో పాటుగా బుధవారం నాటికి భారీగా నీటిమట్టం తగ్గింది. పొన్నపల్లిలో గోదావరి ఏటిగట్టు కోత వద్ద కూడా చేపట్టిన రక్షణ చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. దీంతో ఇక్కడ పరిస్థితి అదుపులోకి వచ్చింది. వలంధర్‌రేవు, లలితాంబ ఘాట్, పడవల రేవు వద్ద ఇంకా గోదావరి ఉధృతి కారణంగా ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సందర్శకులను అనుతించకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. మధవాయిపాలెంలో రాకపోకలు పునరుద్ధరించలేదు.

వరద కారణంగా నీట మునిగిన పొన్నపల్లి, లాకుపేట, నందమూరి కాలనీ, స్టేషన్‌పేట, చిన మామిడిపల్లి ప్రాంతాల్లో పంట పొలాల్లో ఇంకా పూర్తిగా నీరులాగలేదు. ముంపు ప్రాంతాల్లో నీరు లాగిన ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య చర్యలు చేపట్టారు. గోదారిలో వేట కొనసాగడం లేదు. దీంతో సంప్రదాయ మత్స్యకారులు ఖాళీగానే ఉంటున్నారు.

కనకాయలంకను వీడని వరద

యలమంచిలి: కనకాయలంక గ్రామ ప్రజలను వరద వీడడం లేదు. గత నెల 22న వరద వలన మునిగిన కనకాయలంక కాజ్ వే వరుసగా 11వ రోజు కూడా వరద ముంపులోనే ఉంది. దీంతో కనకాయలంక ప్రజలు తమ దైనందిన అవసరాల కోసం పడవల పైనే కాజ్ వే దాటుతున్నారు. గోదావరి ఎగువ భాగంలో వరద తగ్గడంతో యలమంచిలి మండలంలోని ఇతర లంక గ్రామాలలో వరద తగ్గింది. అయితే కాజ్ వేపై వరద తగ్గకపోవడంతో కనకాయలంక ప్రజలకు వరద బెడద తగ్గలేదు. ఇదిలా ఉండగా వరద తగ్గిన గ్రామాలలో రోడ్లపై బురద పేరుకుపోడంతో వాటిని శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లే పనిలో పంచాయతీ సిబ్బంది నిమగ్నమయ్యారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: ఆరోగ్యమే మహాభాగ్యం కావున ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెల్త్ కేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఆగస్టు 1న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం నిర్వహిస్తారన్నారు. ప్రతీ ఒక్కరూ పొగత్రాగడం, మద్యం సేవించడం, గుట్కా వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకావడం వలన ఆరోగ్యం పాడవడమే కాకుండా జీవిత లక్ష్యాన్ని పాడు చేసుకుంటారన్నారు. కార్యక్రమంలో హెల్త్‌కేర్ డిపార్ట్‌మెంట్ కో ఆర్డినేటర్ పి.జ్యోత్స్న, అధ్యాపకులు డాక్టర్ ఎం.రామకృష్ణ, పి.శ్రీనివాసరావు, వి.శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



కోడి గుడ్డు, నిమ్మరసం ద్రావణం తయారీపై శిక్షణ ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

యలమంచిలి: ప్రకృతి వ్యవసాయంపై గురువారం కాంబొట్లపాలెం, గుంపర్రు గ్రామాల్లో రైతులకు ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇన్‌చార్జి పి.అప్పారావు శిక్షణ ఇచ్చారు. దీంట్లో భాగమైన కోడి గుడ్డు, నిమ్మరసం తయారీపై శిక్షణ ఇచ్చారు. 60 కోడి గుడ్లు తీసుకొని అవి మునిగే వరకు సుమారు 10 లీటర్ల నిమ్మరసం వేసుకోవాలన్నారు. ఈ రెండింటినీ ఒక గాజు పాత్రలో వేసి 11 రోజులపాటు నిల్వ చేయాలన్నారు. 11 రోజుల తర్వాత ఆ ద్రావణాన్ని వడకట్టి ద్రావణంలో కిలో బెల్లం పొడి కలపాలన్నారు. ఈ విధంగా కలిపిన తరువాత కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం సిద్ధమవుతుందన్నారు. పావు లీటరు ద్రావణంలో 200 లీటర్ల నీటిని కలిపి ఒక ఎకరం పొలంలో పిచికారీ చేయాలన్నారు. ఈ విధంగా చేయడం వలన పంట దిగుబడి పెరుగుతుందన్నారు. తక్కువ మోతాదులో కాయగూరలు, ఆకుకూరల పంటలకు కూడా ఈ ద్రావణాన్ని ఉపయోగించొచ్చని అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి జి.జ్యోతి, ఐసీఆర్పీలు జద్దు లక్ష్మీనారాయణ, బి.లక్ష్మీదుర్గ, జద్దు రాంబాబు, కె.నరసింహమూర్తి, జె.నాగబాబు, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ సాగుతో ఫల సాయం మెరుగు

పాలకొల్లు అర్బన్: సేంద్రీయ విధానంలో సాగు చేస్తే అధిక ఫల సాయం లభిస్తుందని ప్రకృతి వ్యవసాయ విభాగం భీమవరం జోనల్ కోఆర్డినేటర్ వీరాస్వామి చెప్పారు. పాలకొల్లు మండలం వాలమర్రులో రైతులకి కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం, అగ్నాస్త్రం తయారు చేయడం వివరించారు. గ్రామంలోని 50 మంది రైతులకు సహజ వ్యవసాయం, దాని ప్రయోజనాలను వివరించారు. రసాయనిక ఎరువులు బదులుగా ప్రకృతి నుంచి లభించే వేపాకు, ఆవు మూత్రం, వెల్లుల్లి, పొగాకుతో అగ్నాస్త్రం తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. ఎంటీఎల్ బద్దెల మురళీకృష్ణ, డీఐ అప్పారావు, మండల ఇన్‌చార్జి సాల్మన్‌రాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా కమిటీ ఎంపికకు నోటీసు విడుదల



పాఠశాలలో ఎన్నికల నోటీసు బోర్డు ఏర్పాటు చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు భవానీ ప్రసాద్

పాలకొల్లు సెంట్రల్: పాఠశాలల్లో విద్యా కమిటీకి సంబంధించి నోటీసు విడుదల చేశామని జీవీఎస్‌వీఆర్‌ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీ ప్రసాద్ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు ఎన్నికల ప్రకటన జారీ చేశారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఓటర్ల జాబితాను పాఠశాల నోటీసు బోర్డు నందు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 5న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. మధ్యాహ్నం 4 గంటలకు ఓటర్ల తుది జాబితా సిద్ధం చేస్తామన్నారు. 8న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ తల్లిదండ్రుల జాబితా ప్రకటన, 1.30 గంటలకు కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎంపిక చేస్తామన్నారు. మూడు గంటలకు ప్రమాణ స్వీకారం, ప్రతిజ్ఞ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆదమరిస్తే.. అంతే



ప్రమాదకంగా ఉన్న వంతెన మార్గం

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాధలో మంగలగుంటపాలేనికి వెళ్లే వంతెన మార్గం ప్రమాదకంగా ఉంది. దీంతో అటుగా వెళ్లే వారు ఆందోళనకు గురవుతున్నారు. వంతెన ఎక్కే మార్గంలో అటూ, ఇటూ కూడా రాళ్లు పైకి లేచిపోయి, రోడ్డు శిథిలమయ్యింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు ప్రతీ రోజూ పలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

తల్లి పాల వారోత్సవాలపై అవగాహన



తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పాలకొల్లు అర్బన్: తల్లిపాలు బిడ్డలకు పట్టించడం వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్.మంగ అన్నారు. పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల పంచాయతీ పరిధిలోని జొన్నలగరువులో గురువారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. ఆరు నెలల లోపు వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అలాగే 7వ నెల నుంచి తల్లిపాలు, అనుబంధ ఆహారం ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.విజయకుమారి, కె.సత్యశ్రీ, ఎస్.కుసుమరాణి, ఎం.అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పెదగరువులో..

పాలకొల్లు రూరల్ పంచాయతీ పెదగరువు, యాళ్లవానిగరువులో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ శీలం నాగ మల్లేశ్వరి మాట్లాడుతూ తల్లిపాలు పుట్టిన శిశువుకి పట్టించడం వలన జీవితాంతం ఎంతో ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. దొడ్డా శ్రీనివాసరావు, పాముల రజనీకుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.ప్రశాంతి, డి.లక్ష్మీదుర్గ, పి.అభిరాణి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

యలమంచిలిలో

యలమంచిలి: పుట్టిన అరగంటలో తల్లిపాలు బిడ్డకు పట్టించడం వలన ఆ బిడ్డ జీవితకాలంలో వచ్చే అనేక రోగాలను సమర్థంగా ఎదుర్కొనే శక్తి శరీరానికి వస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.నాగరత్నం, మహ్మద్ హసీనా చెప్పారు. అబ్బిరాజుపాలెం, యలమంచిలి గ్రామాలలో గురువారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల సభలో తల్లిపాల వలన కలిగే ప్రయోనాలను వివరించారు. దొడ్డిపట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర హెల్త్ ఎడ్యుకేటర్ సీతామహాలక్ష్మి, హెల్త్ విజిటర్ నిర్మలకుమారి అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నతల్లి, కుమారి, భవాని, మాధవి, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో

మొగల్తూరు: ప్రతీ బిడ్డకు తల్లి పాలు అందజేయడమే మన లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సూచించారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా గురువారం మొగల్తూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద చేపట్టిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. సీడీపీవో బి.ఊర్మిళ, వైస్ ఎంపీపీ, ఎంపీడీవో వి.బాబ్జిరాజు, ఎంఈవో శామ్యూల్ జాన్,పాల్గొన్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

మొగల్తూరు: ప్రతీ నెల అందించే సామాజిక పింఛన్ల పంపిణీ సజావుగా జరిగిందని, 92.77 శాతం పూర్తైనట్లు ఎంపీడీవో వి.బాబ్జిరాజు గురువారం తెలిపారు. మండలంలోని 20 సచివాలయాలకు సంబంధించి 10,733 పింఛన్ లబ్ధిదారులకు గాను 9957 మందికి పింఛన్లు పంపిణీ చేశామన్నారు.

పాలకొల్లులో

పాలకొల్లు సెంట్రల్: పింఛన్ల పంపిణీలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారని కమిషనర్ విజయ సారథి తెలిపారు. గురువారం స్థానిక 15వ వార్డులో పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ విజయసారథి మాట్లాడుతూ మొదటిరోజు 98 శాతం పింఛన్లు పంపిణీ చేశామన్నారు. పెచ్చెట్టి బాబు, జానీ, జ్ఞానశంకర్ పాల్గొన్నారు.

పెనుగొండలో

పెనుగొండ: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పంపిణీ చేశారు. గురువారం శేషమ్మ చెరువు, కొఠాపర్రు, మునమర్రుల్లో పింఛన్ల పంపిణీలో పాల్గొని లబ్ధిదారులకు రూ.4వేలు పింఛను అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు పోడూరి గోవర్ధన, ఉప్పలపాటి సురేష్ బాబు, ఆచంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మిరెడ్డి సేవలు అభినందనీయం

పెనుమంట్ర: విద్యాభివృద్ధికి కొమ్మిరెడ్డి సాయి సూర్యనారాయణరావు చేసిన సేవలు అభినందనీయమని తణుకు డీవైఈవో సత్యనారాయణ అన్నారు. పెనుమంట్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయుడిగా పని చేస్తూ పదవీ విరమణ చేసిన ఆయనను పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మొగల్తూరు: కేపీపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ బి.సురేష్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కేపీపాలెం సబ్‌స్టేషన్‌లో అదనపు 33 కేవీ ఏర్పాటు నిమిత్తం కేపీపాలెం సౌత్, నార్త్, పేరుపాలెం సౌత్, నార్త్ గ్రామాలలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సమకరించాలని ఆయన కోరారు.

ముత్యాలపల్లి సర్పంచ్ మృతి

మొగల్తూరు: మండలం ముత్యాలపల్లి గ్రామ సర్పంచ్ కొపనాతి పల్లయ్య (65) గురువారం ఉదయం మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడ్తూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇటీవలే స్వ గ్రామం వచ్చి విశ్రాంతి తీసుకుంటూ తుది శ్వాస విడిచారు. ముత్యాలపల్లి గ్రామ సర్పంచ్‌గా రెండోసారి ఎన్నికై ప్రజా సేవలో నిమగ్నమైన పల్లయ్య మృతి తీరని లోటని పలువురు రాజకీయ నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గతంలో ఓదార్పు యాత్ర చేపట్టిన సందర్భంగా ఒక రోజు ముత్యాలపల్లిలోని పల్లయ్య ఇంటిలో విశ్రాంతి తీసుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు చరిత్రాత్మకం

నరసాపురం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ బుధవారం అంబేద్కర్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు వంగలపూడి ఏషియా, ముసూడి రత్నం మాట్లాడుతూ దాదాపు 30 ఏళ్లుగా చేస్తున్న పోరాటం ఫలించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కౌన్సిలర్ సిర్రా కాంతమ్మ, తెన్నేటి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతికి ప్రత్యేక పూజలు

పెనుమంట్ర: ఆషాఢ మాసం పురస్కరించుకుని పెనుమంట్రలో శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో గురువారం రాష్ట్ర వీఆర్వోల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాధాదేవి దంపతుల ఆధ్వర్యంలో స్వామి వారికి క్షీరాభిషేకం, పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీ గణపతిని పలు రకాల కూరగాయలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నిర్వహణ కమిటీ సభ్యులు నల్లమిల్లి గోపిరెడ్డి, తుంపూడి బ్రదర్స్, తదితరులు పాల్గొన్నారు.

గోదావరి గట్టు రోడ్డు ధ్వంసం

నరసాపురం: పట్టణంలోని గోదావరి గట్టు రోడ్డు ధ్వంసమవుతోంది. పడవల రేవు నుంచి కొండాలమ్మ గుడి వరకూ రోడ్డుకు పలుచోట్ల గోతులు పడ్డాయి. రోడ్డు పలు చోట్ల కుంగిపోయింది. ఈ రహదారి మార్గం ద్వారా నిత్యం వేలాది మంది ప్రయాణిస్తుంటారు. రోడ్డు సవ్యంగా లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు రోడ్డు మరమ్మతులపై దష్టి పెట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు దష్టి సారించి, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులదే కీలక పాత్ర

పెనుగొండ: సమ సమాజ స్థాపనలో ఉపాధ్యాయులదే కీలక పాత్రని ఎంఈవో డి.శుభాకరరావు అన్నారు. సిద్ధాంతం ఎంపీపీ ఎల్ఎఫ్ఎల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుసుమ మేరీ జైసీ కుమారి పదవీ విరమణ సందర్భంగా సిద్ధాంతం కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన అభినందన సభలో పాల్గొన్నారు. 40 ఏళ్లుగా విద్యార్థులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. సర్పంచ్ చింతపల్లి గనిరాజు, ఎంపీటీసీలు గుత్తుల సత్యవతి, చిన్నం ఏడుకొండలు, ఎంఈవో పి.రామకృష్ణ, చింతపల్లి జేమ్స్ పాల్గొన్నారు.